www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# మలేరియా అవగాహన, పొగాకు వ్యతిరేక ర్యాలీ

**వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా,**

**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం**




**పులివెందుల,జూన్01.అక్షర టైమ్స్:–** మలేరియా వ్యతిరేక మాసోత్సవం, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నగరిగుట్ట వైద్యాధికారి డాక్టర్ స్నేహ ప్రతిష్య, బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంత కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని అవగాహన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నిల్వ నీటి వల్ల మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాపిస్తాయని హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ ధూమపానం, పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. యువత పొగాకు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం 'డ్రైడే' పాటిస్తూ నీటి తొట్టెలు, కూలర్లు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షలు, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్ కుమార్, సూపర్‌వైజర్ కృష్ణవేణి, పొగాకు నియంత్రణ కౌన్సిలర్ సుమలత, టీబీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఐసీటీసీ కౌన్సిలర్ బాబా వల్లీ, వెంకటసుబ్బయ్య, స్నేహిత అమృత హస్తం ప్రతినిధి రాజు, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.22 లక్షల డా"ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్

**జిల్లా కలెక్టర్ చొరవతో సాకారమైన వైద్య సహాయం**




**నంద్యాల,జూన్01.అక్షర టైమ్స్:–** చాగలమర్రి మండలానికి చెందిన లక్ష్మి ధన్సిక అనే చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (స్టెమ్ సెల్ థెరపీ) చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం డా. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్, సీఈఓ ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ హాలులో చిన్నారి చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.22 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని కలెక్టర్ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.చిన్నారి లక్ష్మి ధన్సికకు అత్యవసరంగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా, ఇందుకు సుమారు రూ.30 లక్షల వరకు వ్యయం అవుతుందని, అంతటి భారీ ఖర్చును భరించే ఆర్థిక స్థోమత తమకు లేదని చిన్నారి తల్లిదండ్రులు గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, చిన్నారి ఆరోగ్య పరిస్థితి మరియు కుటుంబ ఆర్థిక పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, చిన్నారి చికిత్స కోసం రూ.22 లక్షల వరకు డా. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. చిన్నారి ఆరోగ్యంగా కోలుకుని మంచి భవిష్యత్తుతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే, శస్త్ర చికిత్సలో భాగంగా అవసరమయ్యే బోన్ మ్యారో కణాలను చిన్నారి తండ్రి నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు తమ కూతురి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, తమ సమస్యను వెంటనే గుర్తించి సహకరించిన జిల్లా కలెక్టర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ సహాయం బాధిత కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని, ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు.

# లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా డాక్టర్ రవి కృష్ణ ఘనవిజయం

**తాడిపత్రిలో ఆదివారం సాయంత్రం జరిగిన ఏడు రెవెన్యూ జిల్లాలతో కూడిన డిస్ట్రిక్ట్ 316 జె 8వ కన్వెన్షన్ లో**

**డాక్టర్ రవి కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక**

**ఓట్లు వేసిన 149 ప్రతినిధులు డాక్టర్ రవి కృష్ణకు అనుకూలంగా ఓటు వేయడం విశేషం**

**హర్షం వ్యక్తం చేసి అభినందించిన ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్ ల సమాఖ్య మాజీ చైర్మన్ ప్రసాద్, సీనియర్ లయన్స్ సభ్యులు డాక్టర్ సహదేవుడు, నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు**




**నంద్యాల,జూన్01.అక్షర టైమ్స్:–**అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ అనుబంధంగా ఉన్న లయన్స్ జిల్లా 316 జె తాడిపత్రిలో ఆదివారం నిర్వహించిన కన్వెన్షన్ లో నంద్యాల లయన్స్ క్లబ్ తరపున రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పదవికి పోటీ చేసిన నంద్యాల సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డా"రవికృష్ణ భారీ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.లయన్స్ క్లబ్ అంతర్జాతీయ ఏరియా లీడర్ సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సదస్సులో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లా, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలలో ఉన్న 52 క్లబ్బుల నుండి ఓటింగ్ లో పాల్గొన్న 149 మంది డాక్టర్ రవి కృష్ణకు ఏకగ్రీవంగా ఎస్ ఓటు ద్వారా మద్దతు తెలిపి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఎన్నుకున్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రవి కృష్ణ ఎన్నిక కావడం పట్ల నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్స్ ఆంధ్ర ప్రదేశ్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏవిఆర్ ప్రసాద్, డాక్టర్ సహదేవుడు, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, అధ్యక్షులు సోమేశుల నాగరాజు, సీనియర్ సభ్యులు భవనాసి నాగ మహేష్, శ్రీకాంత్, రవి ప్రకాష్, కశెట్టి చంద్రశేఖర్ , మనోహర్ రెడ్డి, షావలి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తాడిపత్రిలో వివిధ జిల్లాల నుండి వచ్చిన లయన్స్ ప్రతినిధులు డాక్టర్ రవి కృష్ణను ఘనంగా సత్కరించారు.రానున్న రెండు సంవత్సరాలు వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పదవి లో, తర్వాత లయన్స్ గవర్నర్ గా ఏడు జిల్లాల పరిధిలో ఉన్న క్లబ్బుల ద్వారా లయన్స్ సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని డాక్టర్ రవి కృష్ణ ప్రకటించారు.

# కూటమి ప్రభుత్వంలో దగా డీఎస్సీపై వైఎస్సార్సీపీ యువతపోరు




కదంతొక్కిన నిరుద్యోగ యువత




**నంద్యాల,జూన్01.అక్షర టైమ్స్:** మెగా కాదు.. ఇది 'దగా' డీఎస్సీ..! నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందంటూ వైఎస్సార్సీపీ నిప్పులు,నంద్యాలలో కదంతొక్కిన నిరుద్యోగ యువత..! కలెక్టరేట్‌ను ముట్టడించిన వైఎస్సార్సీపీ శ్రేణులు..!!స్పోర్ట్స్ కోటా, కటాఫ్ మార్కుల్లో భారీ గోల్‌మాల్..! డీఎస్సీ అక్రమాలపై 'సీబీఐ' విచారణ జరపాల్సిందేనని డిమాండ్,ట్విట్టర్, ఫేస్‌బుక్‌లు కాదు లోకేశ్, కావాల్సింది నిరుద్యోగుల భవిష్యత్తు..! విద్యాశాఖ మంత్రిపై వైసీపీ నేతల ధ్వజం..!!ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగుల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి..! కష్టపడి, రాత్రింబగళ్లు చదివిన మెరిట్ అభ్యర్థుల జీవితాలు కూటమి ప్రభుత్వ నిర్వాకంతో నట్టేట మునిగాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న 'మెగా డీఎస్సీ' కాస్తా.. అక్రమాలు, అవకతవకలతో 'దగా డీఎస్సీ'గా మారిందంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత రోడ్లపైకి వచ్చింది. సోమవారం నంద్యాల వేదికగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'యువతపోరు' హోరెత్తింది. నూనెపల్లి సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు నిరుద్యోగులు కదంతొక్కారు. తమకు జరిగిన అన్యాయంపై, డీఎస్సీలో జరిగిన భారీ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఉరుములా గర్జించారు..! కూటమి ప్రభుత్వంలో... దగా..! అవును, నమ్మి ఓట్లేస్తే నిరుద్యోగుల గొంతు కోశారంటూ అభ్యర్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనల సైరన్ మోగించింది. నంద్యాల నూనెపల్లి సర్కిల్ సాక్షిగా నిరుద్యోగ యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది. జిల్లా కలెక్టరేట్ వైపు వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగుల అడుగులు.. కూటమి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయి. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సీఈసీ మెంబర్ పీపీ నాగిరెడ్డి, ఎమ్మెల్సీఇస్సాక్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగులబిజేంద్రనాథ్ రెడ్డి, స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీ కాటసాని ఓబుల్ రెడ్డి, జిల్లా యువజ విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో కలెక్టరేట్ దద్దరిల్లిపోయింది. డీఎస్సీ అక్రమాలపై తక్షణమే 'సీబీఐ విచారణ' జరిపించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ,కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై సింహస్వప్నమై గర్జించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు నిరుద్యోగుల బాధలు పట్టడం లేదని, ఆయనకు కేవలం సోషల్ మీడియా, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లపై ఉన్న శ్రద్ధ.. యువత భవిష్యత్తుపై లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ట్విట్టర్, ఫేస్‌బుక్‌లు కాదు నిరుద్యోగుల భవిష్యత్తు ముఖ్యం..!" "దమ్ముంటే.. ధైర్యముంటే.. స్పోర్ట్స్ కోటా మెరిట్ లిస్ట్‌ను బహిరంగపరచండని మంత్రి లోకేశ్ ను డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటాలో, ఓపెన్ కేటగిరీ కటాఫ్ మార్కుల వెల్లడిలో దారుణంగా గోల్‌మాల్ చేశారని.. అర్హులైన, రాత్రింబగళ్లు కష్టపడిన మెరిట్ విద్యార్థులను నట్టేట ముంచారని మండిపడ్డారు. పారదర్శకత ఉంటే.. దమ్ముంటే ఆ స్పోర్ట్స్ కేటగిరీ లిస్ట్ ను ఎందుకు దాస్తున్నారని, ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో లక్షలాది సచివాలయ ఉద్యోగాల ప్రక్రియను ఎటువంటి అవినీతి లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా నేతలు గుర్తు చేశారు. కానీ నేడు, కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు అన్యాయం జరిగితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, అభ్యర్థుల పక్షాన ఉండి చివరి శ్వాస వరకు పోరాటం చేస్తామని వైసీపీ శ్రేణులు స్పష్టం చేశాయి. మరి ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వం కళ్లు తెరుస్తుందా? నిరుద్యోగులకు న్యాయం చేస్తుందా? లేక సోషల్ మీడియా ముసుగులోనే కాలం వెళ్లదీస్తుందా అనేది చూడాలి. కార్యక్రమలో నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా యువజ విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ డా. శశికళ రెడ్డి, కల్లూరి రామ లింగా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, జిల్లా కార్యవర్గసభ్యులు,వైసీపీ నంద్యాల జిల్లా లీగల్ సెల్ సభ్యులు, విద్యార్థి విభాగం నాయకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సిఎం సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేసిన ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప



**కౌతాళం,జూన్01.అక్షర టైమ్స్:–** కౌతాళం గ్రామానికి చెందిన సౌదరి భార్గవికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ 25,574/– ఆర్థిక సహాయం మంజూరైంది.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి తిక్కరెడ్డి సిఫారసు మేరకు ఈ సహాయం లభించింది.సోమవారం రోజున కౌతాళం మండలం కౌతాళం గ్రామంలో ఉరుకుంద ఈరన్న దేవాలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప లబ్ధిదారురాలు సౌదరి భార్గవికి ఈ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా చెన్న బసప్ప మాట్లాడుతూ, పేదలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు.అవసరమైన వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో చంద్రశేఖర్ మంజునాథ భీమయ్య చంద్రప్ప పాల్గొన్నారు సహాయం అందించిన ప్రభుత్వానికి, సిఫారసు చేసిన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తిక్కరెడ్డికి చెక్కు అందజేసిన చెన్న బసప్పకి లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

**కాలువల్లో చెత్త, మురుగునీటితో ప్రజలకు ఇబ్బందులు**

**ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు**



**వేంపల్లె,జూన్01.అక్షర టైమ్స్:–**స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ కడప జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా తెలిపారు. మురికి నీటిలో పందులు సంచరిస్తుండటంతో పాటు తాగునీటి వాల్వులు, గుంతలు కూడా మురికి గుంతలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా కో–కన్వీనర్ దాదాపీర్ లు మాట్లాడుతూ 10, 11, 12, 13 వార్డులతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నిస్తే జీతాలు అందడం లేదని, అందుకే పనులు సక్రమంగా చేయలేకపోతున్నామని చెబుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రజల నుంచి సేకరిస్తున్న పన్నుల రూపంలో వచ్చే ప్రజాధనం వినియోగంపై సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుని మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ మండల సభ్యులు పీరు బాషా, ఎస్ఎండీ గౌస్, షఫీ, షేక్ష తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్‌కి ఎంపికైన నాగభూషణం కళాశాల పూర్వ విద్యార్థిని



**బద్వేల్,జూన్01.అక్షర టైమ్స్:–** రాచపూడి నాగభూషణం డిగ్రీ ఓ పీజీ కళాశాల (అటానమస్), బద్వేల్‌లో బి.ఎస్‌సి. విద్యను పూర్తి చేసిన పూర్వ విద్యార్థిని జె. పూజిత అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో విజయవంతంగా ఎంపికయిందని కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ తెలిపారు.అగ్నివీర్ ర్యాలీలో అనేక మంది అభ్యర్థులతో పోటీపడి, తన కృషి, పట్టుదల, అంకితభావంతో పాటు ఎన్‌సీసీ 'సి' సర్టిఫికేట్ కలిగి ఉండడం ద్వారా లభించిన ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజయాన్ని సాధించిందని ఆయన సంతోషం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా తన విజయానికి నిరంతరం మార్గనిర్దేశనం, ప్రోత్సాహం మరియు సహకారం అందించిన కళాశాల యాజమాన్యం కు జె. పూజిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యన్. సి. సి తనకు ఎంతో ఉపయోగపడిందని ఆమె తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ అశోక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లిఫ్టినెంట్ బాల ఓబులేసు, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, సి. ఈ డా.రామసుధ, జె.పూజితను హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆవుల మృతి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె,జూన్01.అక్షర టైమ్స్:–**స్థానిక పట్టణంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆవులు మృతి చెందుతున్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృతి చెందిన ఆవుకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు ఇరవై ఆవులు మృతి చెందినట్లు తెలిపారు. రోడ్లపై సంచరిస్తున్న ఆవులను గోశాలలకు తరలించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గోవులను హిందువులు దేవతల ప్రతిరూపాలుగా ఆరాధిస్తారని, వాటి విషయంలో నిర్లక్ష్యం తగదని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై అధికారులు శ్రద్ధ చూపాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, గౌస్, విశ్రాంత పశువైద్యాధికారి నక్కా రాజారాం, పంచాయతీ సానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


**తాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి**


**టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి**



**వేంపల్లె,జూన్01.అక్షర టైమ్స్:–** ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారమే ప్రధాన లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముసలరెడ్డిగారిపల్లి గ్రామంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామముని రెడ్డి లతో కలిసి తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముసలరెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్ షబ్బీర్, తెలంగాణవల్లి, జబీబుల్లా, రెడ్డయ్య చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే), రామగంగిరెడ్డి, రామాంజీ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, డక్కా రమేష్, మడక శ్రీను, మాబు షరీఫ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలకు వరం..





**ఆదోని,జూన్01.అక్షర టైమ్స్:-** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో ఆదోని నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్ అందజేస్తున్నారని ఉమాపతి నాయుడు తెలియజేశారు. సోమవారం అరెకల్ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో కలసి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఎన్టీఆర్ భరోసాతో నిరుపేదలకు, నిరాశ్రయులకు ఆర్థిక భరోసా చేకూరుతుందన్నారు.ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాగానే పెన్షన్ మూడు వేల నుండి నాలుగు వేలకు పెంపు చేయడం, పెన్షన్ ప్రతినెల మొదటి తారీకునే అందజేయడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారుని. పేర్కొన్నారు.ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తేదీనే పెన్షన్ పంపిణీకి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందిని.ఈ క్రమంలోనే నారాచంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఆలస్యం లేకుండా పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తున్నట్లు స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో రంగస్వామి నాయుడు, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ గారు, రంగన్న, జిందే శంకర్ మండల అధ్యక్షుడు శివప్ప, కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ రంగన్న, లక్ష్మన్న, భీమా, నాగరాజ్, సీనా తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్





**ప్రజా సమక్షమే ప్రభుత్వ ధ్యేయం, పెన్షన్ అందజేసి లబ్ధిదారులను పరామర్శించిన: గుడిసె ఆది కృష్ణమ్మ**

**ఆదోని,జూన్01.అక్షర టైమ్స్:-**ఎన్టీఆర్ పేదలకు పెన్షన్ పంపిణీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదోని మండలం బైచిగెరి గ్రామంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు పారదర్శకంగా చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, పెన్షన్ పథకాలు అనేక కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని ఆమె తెలిపారు. గ్రామ ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బెస్త ఓంకార్ , ఎక్స్ ఎంపీపీ మురళి, సాదిక్ వలి, చిన్న స్వామి,వెంకటేష్, దస్తగిరి,నరసప్ప,తిక్కస్వామి,ఆంజనేయులు,అశోక్, అంజి, ఖాసిం, రాజు, బాబురావు,కుప్పగల్ హనుమంతు,దేవేంద్ర, భాస్కర్,విజయ్,సూరి, లక్ష్మన్న ,మరియు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 3 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించండి సారూ..

**ప్రభుత్వ భూమిని రక్షించడంలో విఫలమైన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్**

**పెద్దకడబూరు గ్రామం నందు సర్వే నెంబర్ 262 /ఎ3 లో విస్తీర్ణం 3.30 ఎకరాల ప్రభుత్వ భూమి మాయం**

**ఫోరమ్ ఫర్ ఆర్టిఐ జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న కార్తికేయ డిమాండ్**



**పెద్దకడుబూరు,జూన్01.అక్షర టైమ్స్:-** ప్రజల ఆస్తిగా, ప్రభుత్వ సంపదగా భావించబడే సుమారు మూడు కోట్లు రూపాయల విలువ గల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురవుతున్నప్పటికీ, సంబంధిత రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ భూములను పరిరక్షించడం, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటం రెవెన్యూ శాఖ యొక్క ప్రధాన బాధ్యత. అయితే భూమి కబ్జా జరుగుతున్నట్లు పలుమార్లు ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని ఫోరమ్ ఫర్ ఆర్టిఐ జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న కార్తికేయ పత్రిక సమావేశంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు, మరియు సామాజిక కార్యకర్తలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు కనిపించకపోవడం విచారకరం. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే, ప్రజా సంపదకు జరుగుతున్న నష్టానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఈ విషయమై జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రాలు సమర్పించడమే కాకుండా, పీజీఆర్ఎస్ (పిజిఆర్ఎస్) ద్వారా కూడా ఫిర్యాదులు అందజేయబడినప్పటికీ, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యంగా ఉండటం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఫిర్యాదులపై విచారణ జరిపి, కబ్జాదారులకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అదేవిధంగా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారుల పాత్రపై సమగ్ర విచారణ నిర్వహించి, తప్పు చేసినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. కాబట్టి జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి, భూమిని పరిరక్షించడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు చేపట్టి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# వెండి కొంటున్నారా? జాగ్రత్త! ప్రతి ముగ్గురిలో ఒకరు మోసపోతున్నారట సర్వేలో షాకింగ్ నిజాలు..!




వెండి కొనేటప్పుడు కేవలం దాని మెరుపును చూసి మోసపోకండి. మీరు కష్టపడి సంపాదించిన డబ్బుకు సరైన విలువ దక్కాలంటే, తప్పనిసరిగా దీ×ూ హాల్‌మార్క్, HUID కోడ్ ఉన్న వెండిని మాత్రమే కొనుగోలు చేయండి. ప్టెంబర్ 1, 2025 తర్వాత హాల్‌మార్క్.. వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిపిన ఒక సర్వేలో వెండి నాణ్యతకు సంబంధించి షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. సర్వేలో తేలిన సంచలన విషయాలు చూస్తే.. గడిచిన 5 ఏళ్లలో వెండి కొనుగోలు చేసిన వారిపై నిర్వహించిన సర్వే ప్రకారం.. 31% మంది వినియోగదారులు తాము కొన్న వెండిలో స్వచ్ఛత (Purity) లేదని, నాణ్యత విషయంలో మోసపోయామని అంగీకరించారు. 93% మంది బంగారం తరహాలోనే వెండికి కూడా హాల్‌మార్కింగ్ (Hallmarking) తప్పనిసరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కేవలం 2% మంది మాత్రమే హాల్‌మార్కింగ్ అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

**2026 నాటికి భారీగా పెరగనున్న ధరలు:**

పెట్టుబడి దృష్ట్యా కూడా వెండికి ఆదరణ పెరుగుతోంది. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం.. ధరల అంచనా 2026 నాటికి కిలో వెండి ధర రూ.1.7 లక్షల నుండి రూ.1.9 లక్షల మధ్య ఉండవచ్చు. ధరలు ఇంతలా పెరుగుతున్న సమయంలో కఠినమైన నిబంధనలు లేకపోతే సామాన్య వినియోగదారులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**వెండి స్వచ్ఛతను గుర్తించడం ఎలా?**

వినియోగదారుల రక్షణ కోసం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (దీ×ూ) వెండి స్వచ్ఛతను బట్టి 7 గ్రేడ్‌లను ఖరారు చేసింది:

గ్రేడ్లు: 800, 835, 900, 925, 958, 970, 990, మరియు 999. ప్రతి హాల్‌మార్క్ ఆభరణంపై ఈ మూడు గుర్తులు ఉండాలి:

BIS లోగో:

స్వచ్ఛతా గ్రేడ్ (ఉదాహరణకు 925)

HUID కోడ్ (ఆరు అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య)

ప్రభుత్వ చర్యలు BIS కేర్ యాప్:

సెప్టెంబర్ 1, 2025 తర్వాత హాల్‌మార్క్ చేసిన వెండి ఉత్పత్తుల వివరాలను మీ ఫోన్ ద్వారానే తనిఖీ చేసుకోవచ్చు. దీ×ూ ఝతీవ యాప్ ద్వారా HUID కోడ్‌ను ఎంటర్ చేసి వెండి స్వచ్ఛతను ధృవీకరించుకోవచ్చు. 2026 నాటికి దేశవ్యాప్తంగా 110 జిల్లాల్లో సుమారు 300కు పైగా కొత్త హాల్‌మార్కింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వెండి కొనేటప్పుడు కేవలం దాని మెరుపును చూసి మోసపోకండి. మీరు కష్టపడి సంపాదించిన డబ్బుకు సరైన విలువ దక్కాలంటే, తప్పనిసరిగా హాల్‌మార్క్, HUID కోడ్ ఉన్న వెండిని మాత్రమే కొనుగోలు చేయండి.గమనిక: పైన పేర్కొన్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు ఆర్థిక నిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**డీసీసీబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

**పింఛన్ల పంపిణీ లో పాల్గొన్న సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేల్,జూన్01.అక్షర టైమ్స్:-** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని డీసీసీబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు.సోమవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ఆయన పింఛన్ల పంపిణీ లో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేయగా, వారి ముఖాల్లో కనిపించిన చిరునవ్వే తమకు కొండంత బలమని ఆయన పేర్కొన్నారు.అనంతరం స్థానిక మహిళలు వార్డులో నెలకొన్న రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు మరియు మంచినీటి సరఫరా ఇబ్బందులను సూర్యనారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. కె. ఉషశ్రీ

**కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం**



**వేంపల్లె,జూన్01.అక్షర టైమ్స్:-** స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె. ఉషశ్రీ పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు ఆ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. డాక్టర్ కె. ఉషశ్రీ కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతిగా పనిచేసి, ప్రమోషన్‌పై ఇక్కడ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ మాట్లాడుతూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనందున తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.

# ఇంటింటికి పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న

**సొసైటీ చైర్మన్ అల్లూరు వెంకటపతి రాజు**

**మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు దని**

**మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్**



**కౌతాళం,జూన్01.అక్షర టైమ్స్:-** సోమవారం రోజున కౌతాళం టౌన్ లో భేటీ గేరిమారెమ్మ గుడి,మాసులగేరి, అత్తర్ వీధి,ఎస్సీ కాలనీ,ఎన్టీఆర్ నగర్, వీధిలో ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతినెల నెల ఒకటో తారీకు ఉదయాన్నే గడపగడపకు వెళ్లి వృద్ధులకు 4000 రూపాయలు మరియు వికలాంగులకు 6000 రూపాయలు ఇస్తున్నటువంటి ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు డాక్టర్ రాజనంద్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖన్న,గిరి, రమేష్ ,గొట్టయ్య, రేవన్న,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించిన వైసీపీ యువ నాయకులు దాట్ల సుబ్బరాజు



**కౌతాళం,జూన్01.అక్షర టైమ్స్:-** సోమవారం రోజున కౌతాళం గ్రామంలో మాసలగేరిలో అనారోగ్యంతో బాధపడుతున్న కోడిగుడ్ల రామంజిని పరామర్శించిన వైసీపీ యువ నాయకులు దాట్ల సుబ్బరాజు తొందరగా రామాంజి ఆరోగ్యం బాగుపడాలని కోరడం జరిగింది. అనంతరం వారి కుటుంబ సభ్యులతో ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యంగా ఉండాలని కోరడం జరిగింది.దాట్ల యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# వసుధ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేసిన బి. నకేష్ రెడ్డి



**కౌతాళం,జూన్01.అక్షర టైమ్స్:-**కౌతాళం మండల పరిధిలోని బదినేహాళ్ గ్రామంలో గత కొన్ని నెలల క్రిందట నుండి అనారోగ్యంతో బాధపడుతున్నటువం టి ఎస్.అనిల్ కు నాయకులు బి.నకేష్ రెడ్డి వసుధ ఫౌండేషన్ ద్వారా అక్షరాల 7000 వేల రూపాయలు నగదు రూపంలో ఆర్థిక సహాయం చేయడం జరిగింది.సహాయం చేసినందుకు రెడ్డికి అలాగే వసుధ ఫౌండేషన్ కు అనిల్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది.